కథానిక

# పోయిన మర్యాద

యన్. ఆర్. నంది

అన్నీ కొత్త ముఖాలు, కొత్త ప్రదేశాలు, కొత్త మాటలు: ఈ అలవాటులేని వాతావరణంలో రాఘవరావు ఏదో పోగొట్టుకొన్నట్టు దిగాలుగా వున్నాడు ఆ రెండురోజులూ. కాలేజీలో చేరిపించడానికి తీసుకవచ్చిన తండ్రి, బస, గిస ఏర్పాటుచేసిన తర్వాత వెళ్లిపోయేటప్పుడు చెప్పవలసిన జాగ్రత్తలన్నీ చెప్పి వెళ్ళిపోయాడు.

ఇంత వయస్సొచ్చినా యింకా ఎందుకో ఆయన అలాంటి పాఠాలు నేర్పుతాడో! బండెక్కుతూ అదే గొడవ:

"అబ్బాయ్, జాగ్రత్తరా; బుద్ధిగా చదువుకో; ఇక్కడికీ అక్కడికీ తిరక్కు. స్నేహాలు కట్టావా చెడిపోతావ్: కొండంతటి వాళ్ళే తుంటరి స్నేహాలకి కుప్పలా కూలిపోయారు— హాఁ! వినుకొంటున్నావో!"

ఈ బోధలు మనస్సుకి పూర్తిగా పట్టాలి. కాని రాఘవరావు సిగ్గుతో చచ్చిపోయాడు. చుట్టూవున్న మనుష్యులు నవ్వుకొంటారేమోనని భయపడ్డాడు. తనింకా పాలుతాగే పిల్లవాడేమోనని ఆయన ఊహ కాబోలు.

బండి వెళ్ళిపోయిన తర్వాత లాడ్జిలోకి వచ్చాడు.

అన్నీ అపరిచితమైన ముఖాలు. తనని చూసి, ఆ లాడ్జిలో వుంటున్న పదిమంది విద్యార్థులూ మాటాడకండా నిశ్శబ్దమవడంతో రాఘవ ఎందుకో తనలో తానే వణకిపోయాడు. వాళ్లందరి మధ్యా తనే కొత్తవాడు వెళ్ళి కూచోడానికి ధైర్యం చాలింది కాదు. పోనీ వాళ్ళందర్నీ తనకి తానుగా పలకరించి స్నేహం చేసుకోడానికి సిగ్గు. మనస్సులో జరిగే ఈ భావ సంచలనం కళ్లల్లో ప్రతిఫలించింది. వాళ్ల దృష్టినించి తప్పించుకొని బయటికి వెళ్ళిపోవాలనుకొన్నాడు. అంతలోనే ఒక విద్యార్థి నిలబడి ఏదో అన్నాడు. ప్రశ్నించినట్టున్నాడు: ప్రశ్న వినిపించలేదు. తడబడుతూ అడిగాడు:

"నన్నేనాండి?"

"హాఁ. మీరు ఎక్కణ్ణించి వచ్చారు?"

"పెద్దాపురంనించి"

"మీ గ్రూపు?"

"హిస్టరీస్"

"ఐతే యిహనేం-యిలారండి: మీరు మా వర్గంలో చేరుతారు" ఆ చివర కూచొన్న ముగ్గురూ ఆహ్వానించారు.

రాఘవ చిన్న చిరునవ్వు నవ్వాడు: "ఫర్వాలేదు లెండి" చిన్న అసందర్భమైన మాట విసిరాడు. ఆహ్వానాల్లో యిలాంటి అర్థ తిరస్కారానికి ఆస్కారం వుందని అతనికి తెలీదు.

"రాండి - యిక్కడ కూచోండి. మనం అందరం ఒకటే ఈ లాడ్జిలో. ఈ దేశంలో గూడ ఒకటే. ఈ ప్రపంచంలో గూడ" అన్నాడు రామారావు నవ్వుతూ.

మిగతా వాళ్లంతా నవ్వారు. రాఘవగూడ సన్నగా శ్రుతి కలిపాడుగాని, వాళ్ల నవ్వులోని అంతరార్థం అతనికి తెలీదు. రామారావు ఫక్తు "హ్యూమనిస్టు" అక్కడికి వచ్చే అగంతకులందరితోనూ అలానే తమాషాగా మాటాడుతుంటాడు.

"ఇంతకీ మీ పేరు చెప్పారు కాదు."

రాఘవరావు తన పేరు చెప్పుకొన్నాడు. వాళ్ళంత సరదాగా, ఉత్సాహంతో మాటాడుతున్నపుడు తనెందుకలా సిగ్గుగా నసగాలో అర్థంకాలేదు. వాళ్ళల్లాగే తనూ ధైర్యంగా మాటాడాలి. ఏవో అప్పటికి తనకి తోచిన రెండుమూడు ప్రశ్నలు వేశాడు. జవాబులు, ఎంతో కాలంనించి పరిచయమైన స్నేహితులు యిచ్చిన వాటిలాగే వున్నాయి. రాఘవ అనుకొన్నాడు: వీళ్లల్లో తనుసులభంగా కలిసిపోగలనని.

అలాగే కలిసిపోయాడు గూడా! అందుకు తోడు రాఘవకి గేయాలు వ్రాయడంలో కాస్త శక్తి వుంది. గేయాలంటే చెవికోసుకొనే ఆ విద్యార్థులమధ్య, ఈ జర్నలిజం వెనక నించి రాఘవ మనస్సు విజృంభించింది. ప్రతీ స్టూడెంటుతోనూ మెల్లమెల్లగా మాటలు కలుపుకొన్నాడు. వీటికీ, నాటికీ వాళ్ళ దగ్గరకి పోసాగాడు, అందరితో కలిసి కాలేజీకి వెళ్లేవాడు, వచ్చేవాడు. సినిమాలకి గూడ ఉత్సాహం చూపించేవాడు. వాళ్లల్లో ఎవరైనా డబ్బుల్లేక వుండిపోతే తను టిక్కెట్టుకట్టి తీసుక వెళ్ళాడు. సినిమాలో కూచొన్న తర్వాత ప్రక్కహాస్యంచేసి స్నేహితుల్ని నవ్వించేవాడు జట్టుగా కలసి వెళ్ళేటప్పుడు రోడ్డుమీద రిక్షావాళ్ళని, ఇటుఅటు పోయే జనాన్ని కాలేజీ అమ్మాయిల్ని ఏడిపించేవాడు.

ఐదునెలలు గడచేసరికి మొట్టమొదట ఎంతయితే సిగ్గుగా దిగాలుగా ఈ కొత్తవాళ్ళ మధ్య వుండేవాడో అంత ఉత్సాహంగా హాస్యగాడిలా తయారయ్యాడు. స్నేహాల్లో కొత్తదనం పాతగా మారింది. 'ఏమండీ' మిత్రత్వం 'ఏరా' మిత్రత్వానికి జారింది.

వాళ్లని ఏడిపించడానికి ఆ లాడ్జిలో పదిమందికీ పది మారుపేర్లు పెట్టాడు. అసలు పేర్లు ఎగిరిపోయాయి: ఇవే సార్థకమైపోయాయి. కొంతమంది ఉడుక్కునేవారు; కొందరు సరికి సమానంగా రాఘవని ఏడిపించేవారు. ఈ హాస్యాలకి యుక్తాయుక్తాలు, స్థానాస్థానాలు అతీతమయ్యాయి. క్లాసుల్లో, రోడ్డుమీద, సినిమాల్లో చివరికి పెద్దమనుష్యుల మధ్యగూడ యివి యథాప్రకారం సాగుతూనే వచ్చాయి.

వీటిని సహించలేక ఒక విద్యార్థి వరసగా పదిరోజులు రాఘవతో మాట్లాడ్డం మానేశాడు. కాని రాఘవరావు ఊరుకొన్నాడు కాడు. అతను తిరిగి తనతో వచ్చినట్టు మాటాడే వరకూ ఏడిపించాడు; పాటలు పాడాడు. సూటీలు విసిరాడు. చివరికి అతను మాటాడ్డమే బాగున్నట్టుందని మెల్లగా మాటలు కలుపుకొన్నాడు.

ఆ లాడ్జికి కొత్తగా వచ్చిన రాఘవే లీడరు అయ్యాడు. చదువుకొనే వాళ్ళని చదువుకోనిచ్చేవాడు కాదు. పడుకొనేవాళ్ళ చెవుల్లో నీళ్లుపోసేసేవాడు. స్నానం చేసేవాళ్ళ తువాళ్లు దాచేసేవాడు. ఎన్నిరకాలుగా ఏడిపించాలో అన్నిరకాలుగా ఏడిపించేవాడు.

స్నేహితుల మధ్య వున్నపుడు వుండే రాఘవ మనస్తత్వం, ఒంటరిగా వున్నపుడు అందుకు భిన్నంగా వుండేది. ఒక్కడూ రోడ్డుమీద నించి నడచిపోయేటప్పుడు తల భూమిలోకి కూరుకుపోయినట్టు వుండేది. రిక్షావాళ్ళనిగాని, రోడ్డుమీదపోయే జనాన్నిగాని, అకస్మాత్తుగా తారసిల్లిన గర్ల్-క్లాస్‌మేట్స్‌నిగాని ఏం అనేవాడు కాదు-కనీసం తలెత్తయినా చూసేవాడు కాదు. అందులో ఆడవాళ్ళంటే ఆమడదూరం నించే తప్పి ఎడకు పోయేవాడు.

మెల్లమెల్లగా కాలం దొర్లుకొంటూ పోతూంది... పరీక్షలు ఐపోయాయి. శలవలిచ్చారు; ఎవరిళ్ళకి వాళ్లు వెళ్ళిపోయారు. తిరిగి కాలేజీలు తెరిచేసరికి అందరూ వచ్చారు.

వచ్చిన మూడో ఆదివారంనాడు, రాఘవ మిగతా వాళ్ళతో కలసి బొమ్మార్లు పిక్నిక్‌కి తయారవుతున్నాడు. ఇంతలో యెవరో ఒక అపరిచితుడు ద్వారందగ్గరకి వచ్చాడు రాఘవ తలెత్తి అడిగాడు: "ఎవరు కావాలి మీకు?"

ఎదుటి వ్యక్తి ఎందుకో సంకోచించాడు.

"నేను ఆర్ట్స్ కాలేజీలో బి. ఏ. ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. ఊళ్ళో సరైన వసతి నాకు కనిపించలేదు. అందువల్ల మీ లాడ్జిలో ఏమైనా ఖాళీ వుందేమోనని..."

"అబ్బే, లేదండి: ఇప్పటికే మేం సరిగా పదకొండుమంది వున్నాం. ఏదో అలా యిలా సర్దుకొంటూ గడుపుకొంటున్నాం. అందులో మీరుగూడ వచ్చి చేరినట్టయితే అటు మీకూ సుఖంవుండదు, ఇటు మేమూ బాధపడతాం."

వచ్చిన విద్యార్థి ముఖం చిన్నబోయింది. జాలిగా అందరికేసీ చూశాడు. వయస్సులో వాళ్ళందరికంటె చిన్నవాడైనప్పటికీ, ముఖంలో తేజం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. పరీక్షగా అతనివేపు చూస్తున్న రాఘవరావుకి ఈ దృక్కులు దయని కలిగించాయి.

"ఫర్వాలేదు రాఘవ. ఏదో వున్నంతమట్టుకి సర్దుకొందాం."

వూరుకోనేవాడు కాదు. సారథితో మాంచి రసవంతంగా వాదించే సమయాన పానకంలో పుడకలా అనేవాడు:

“అబ్బ వూరుకోండి బాబు. మీ చెత్త వేదాంతాలు వినలేక చెవులు బద్దలైపోతున్నాయి.

సారథి చిరునవ్వుతో చూసేవాడు. తన వాదన యిలా సమయానికి అకస్మాత్తుగా ఆగిపోయినందుకు మిగతవాళ్లు రాఘవ కేసి కొరకొర చూపులు చూసేవారు. సుందరరావు లాంటి వాళ్లు సరికిసరిగా అతన్ని వేళాకోళం చేసేవారు. చివరికా విజ్ఞాన సభ హాస్యసభగా మారిపోయేది.

ఒక రోజున, రాఘవ చెప్పిచెప్పి లాభంలేక, నీళ్ళు తెచ్చి సభికులమీద చల్లేశాడు. ఎక్కడి వాళ్లక్కడ దులుపుకొంటూ పారిపోయారు.

కాని ఈ మోటు హాస్యాలని కొందరు భరించలేకపోయారు. ఎదురుగా అడ్డు చెప్పలేక చాటుగా వచ్చి సాణుకొన్నారు.

“స్థానాస్థానాలు వుండొద్దటండీ? తనకి వేళాకోళం చెయ్యడం వచ్చని యిష్టమొచ్చినట్లల్లా చేస్తుంటే భరించేవారెవరు?”

“పోనిస్తురూ; అతని సైకాలజీ అంతని సరిపెట్టుకొందాం.”

మొదట విద్యార్థి యింతెత్తున లేచాడు. రెండో విద్యార్థి సరిచేయబోయాడు. కాని లాభంలేక పోయింది. ఈ కోలాహలం విని సుందరరావు, రామారావులు వచ్చారు. విషయమంతా విన్న తర్వాత మరి మాటాడలేక అప్పటికి వాళ్లని సముదాయించి ఎవరి స్థానాల్లోకి వాళ్ళని పంపించేశారు.

తెల్లవారిన తర్వాత రాఘవ మళ్ళా అల్లరి ప్రారంభించాడు అవతల పరుపుమీద పడుకున్న కృష్ణారావు, ముఖంమీద నీళ్లు చల్లి లేపాడు. అతను ఏదో మంచి కల కాస్తున్నట్టున్నాడు. ఈ చిలిపి చేష్టకి కోపిష్టి అయిపోయాడు. పర్యవసానం: చిన్న యుద్ధం!

ఇంతలో రామారావు, సుందరరావు కలగ చేసుకొని దాన్ని అంతటితో ఆపేశారు. ఈ వూహించలేని కలహానికి రాఘవ చిన్నబోయాడు. రామారావు అతన్ని పక్కకి పిలిచి అన్నాడు:

“చూడు రాఘవ్, నన్ను మరోలా అర్థం చేసుకోకు. కాని చెప్పవలసి వచ్చి చెబుతున్నాను. నీ ప్రవర్తనకి యిక్కడ చాలామంది బాధపడుతున్నారు. చూడు, మనుష్యుల మనస్తత్వాలన్నీ ఒక్కలాగుండవు — హాస్యానికి గూడ ఒక హద్దు అనేది వుండాలి, అది దాటి ముందుకుపోతే ఎన్నో అనర్థాలు సంభవిస్తాయి.”

ఈ మాటలకి మరింత క్రుంగిపోయాడు రాఘవ. తన ప్రవర్తనకి చాలామంది బాధపడుతున్నారంటే తనని యింతవరకూ కొంతమంది అసహ్యించుకొంటున్నారన్న మాట. తను కలలోనైనా వూహించని విషయం! ఇందులో ఎవరు తనని అసహ్యించుకొంటున్నారో అనవసరం. మొత్తానికి తనని కొంతమంది ద్వేషిస్తున్నారన్న మాట.

అది మొదలు రాఘవ ప్రతీ విషయంలోనూ భయపడుతూనే వున్నాడు. ఏమాట మాటాడాలన్నా ముందు మనస్సులో మాటాడాలా వద్దా అనే అంతః సంఘర్షణ బయలుదేరేది. మామూలు ప్రకారం నోటి చివర వరకు వచ్చిన సహజహాస్యపు మాటలని బలవంతంగా ఆపుకోవడం మొదలుపెట్టాడు. ఇది అలవాటుగా చేసుకోవాలని చాలా ప్రయత్నాలు చేశాడు. కాని అలా అలవాటైన నోటినించి అప్పుడప్పుడు అప్రయత్నంగా ఆ మాటలు జారిపోతూ వుండేవి. కాని వెంటనే మనస్సునించి మాటలకి కళ్ళాలు వెయ్యడానికి తెగ ప్రయత్నించేవాడు.

ఒకసారి సారథి కాలేజీకి వెడుతున్నపుడు అడిగాడు: “మీలో ఏదో చిన్న మార్పు కనిపిస్తుందే!”

చిరునవ్వుతో “అబ్బే! ఏం లేదండీ” అంటూ కప్పుకోబోయాడు.

“ఎందుకో మీరు ఈమధ్య కొంతకాలంగా పరధ్యానంగా వుంటున్నారు.”

దానికి సమాధానం సుందర్రావు నవ్వుతూ అన్నాడు: “ఏమో! మనస్సు సుశీల మీదికి పోతూందేమో?”

సారథి గూడ నవ్వాడు.

కాని రాఘవ ఆ నవ్వుకి కాస్త కించపడ్డాడు. నోటి చివరివరకు వచ్చిన సమాధా

సాన్ని గూడ అపుకోవడం వల్ల ఈమాటలు మరింత కష్టపెట్టాయి. వాళ్లు యింకో మరి రెండు మాటలు అలాంటివి విసిరారా రాఘవ కంటినించి నీళ్లు గూడ తిరిగిపోవలసిందే. తన నించి ఏదో శక్తి పోయినట్టు, అది వాళ్ళకి సంభవించినట్టు, దానికి తట్టుకోలేక తను ఒరిగిపోయినట్టు బాధపడ్డాడు. పైకి సన్నగా చిరునవ్వు నవ్వాడేగాని, ఆ చిరునవ్వు వెనుక ఎంతో మానసిక దుర్బలతని బలంగా, బలవంతంగా అణచిపెట్టుకొన్నాడు.

క్లాసులో ఏ విషయం తలకి ఎక్కేదికాదు. ఏదో గూఢంగా ఆలోచిస్తున్నట్టు దృష్టిని తెల్లగోడల్లోకి పోనిచ్చేవాడు. కాని పక్కన కూర్చున్న సారథి మాత్రం నిక్షేపంగా లెక్చరర్ ఉపన్యాసాన్ని వింటూండేవాడు. కావలసిన చోట రాసుకొంటూ, ముఖ్యమైనవి నోట్ చేసుకొంటూండేవాడు.

ఈ చర్యలు రాఘవకి ఒక విధమైన అసూయని కలిగించేవి. జీవితంలో అంతవరకు అనుభవంలో లేని ఒక ఫీలింగ్ అతనిచుట్టూ దోయనారంభించింది. కాని యివన్నీ ఒక్క క్షణంలో మనస్సునించి పూర్తిగా దూరంగా పోయేసరికి తనమీద తనకే అసహ్యం కలిగేది.

ఒక సాయంకాలం లాడ్జిలో సారథితో రామారావు చిన్న వాదన వేసుకొన్నాడు. మానవత్వానికి సంబంధించని ఈ కొత్తవాదాలు మానవుణ్ణి తెలివిగల మూర్ఖునిగా మార్చడానికే అని రామారావు వాదన. దాన్ని వ్యాఖ్యానిస్తూ విమర్శించాడు సారథి. వాళ్ళ వాదనతో రకరకాల నవ్వులు, హాస్యాలు పుట్టాయి. పొట్టచెక్కలయ్యేటట్టు నవ్వుతున్నారు మిగతా వాళ్ళు.

సహజంగా హాస్యగాడైన రాఘవ, యిందులో బుద్ధిపూర్వకంగా కలిగించుకోలేదు, బలవంతంగా మనస్సుని నొక్కిపెట్టుకొన్నాడు. ఒత్తిడి ఎక్కువయ్యేకొద్దీ ఉద్వేగం హెచ్చింది. రక్తం వడిగా పరుగులు తీసింది. ఆ కారణంగా ముచ్చెమటలూ పోశాయి. దీన్నించి తప్పించుకోలేక చట్టున లేచి బయటికి వెళ్ళిపోయాడు.

పార్కులో మనుష్యులెవరూ లేనిచోట కూర్చున్నాడు. ఉద్వేగం యింకా తగ్గలేదు. తలలో ఏవేవో ఆలోచనలు తిరిగాయి.

తనని వాళ్లు అసహ్యించుకొంటున్నారు, తను సరదాగా హాస్యాలాడితే వాళ్ళు బాధపడతారు. వాళ్ళమటుకి వాళ్ళని నవ్వుకోనియ్ చావనియ్, తను మాత్రం వాళ్ళకి దూరంగా వుండాలి. తనవల్ల వాళ్ళు ఎలాంటి బాధాపడి, పర్యవసానంగా తనని అసహ్యించుకోగూడదు.

లేచాడు- తిరిగి వచ్చెయ్యడానికి. సారథి జ్ఞాపకానికి వచ్చాడు. అతనిచుట్టూ చేరుతున్న రూమ్‌మేట్స్ తన్ని వెక్కిరిస్తున్నట్టు కనిపించారు. తను కొత్తగా వచ్చినప్పుడు తనచుట్టూ వీళ్ళంతా అలానే చేరేవారు. వీళ్ళని నవ్విస్తూ వుండేవాడు. వాళ్ళల్లో తను ఒక అధికారి అయాడు. కాని యిప్పుడా అధికారాన్ని తన నించి సారథి లాగుకొన్నాడు. సారథే తను వాళ్ళందరి దృష్టిలో అలుసైపోవడానికి కారణం. అతనే తనని వీళ్లు అసహ్యించుకోడానికి గూడ కారణం.

రాఘవ మనస్సులో సారథిమీద విషబీజాలు నాటుకొన్నాయి. అతన్ని తనహృదయమంతటితోనూ ద్వేషింప మొదలుపెట్టాడు. సారథి ప్రతీ చర్యనీ గర్వాతంగానే తీసుకొన్నాడు. అసహ్యం, అసూయ, ద్వేషం, పగ రానురాను బలంగా వృద్ధిపొందాయి.

ఒకనాడు అందరూ సినిమాకి వెళ్ళడానికి ప్రోగ్రాం వేసుకొన్నారు. ఆ విషయాన్ని మొట్టమొదట సారథి చెవిలో వేశారు. సరే అంటే సరే అన్నారు అందరూ. ఆ చివర పడుకొన్న రాఘవ ఆ వార్త తనవరకు వస్తుందో రాదో అని ఎదురు చూశాడు. కాని వాళ్లు ఈ వార్తని ప్రతీవాళ్ళకి బొట్టుపెట్టి చెప్పేటంత ముఖ్యవార్తగా ఎంచలేదు. మనస్సులో రేగుతున్న ద్వేషాగ్ని ఈ పరాభవంతో మరింత రగిలింది.

సినిమాకి తయారయ్యారు. రాఘవ గూడ వస్తున్నాడని సారథి అనుకొన్నాడు. కాని తీరా అందరూ సిద్ధమయ్యేసరికి యింకా రాఘవ పడుకొనే వున్నాడు. సారథి వచ్చి అడిగాడు:

“అరె, మీరింకా పడుకొనే వున్నారు! రారా సినిమాకి?”

రాఘవ మాటాడ్డలేదు.

"పాపం డబ్బుల్లేనట్టున్నాయి" రామకృష్ణ నవ్వాడు.

నిజానికి రాఘువదగ్గర అసలు డబ్బులు లేవు. రామకృష్ణ విసిరిన ఆ 'కరుణావాక్యం' అతని మనస్సులో వ్యతిరేకంగా పనిచేసింది.

"నాదగ్గర వున్నాయి, రాండి. ఫర్వాలేదు" సారథి అతన్ని కదపచూశాడు. కాని లాభం లేకపోయింది. రాఘవ కోపంతో నిలువెల్లా దహించుకపోతున్నా సారథినించి తప్పించుకోడానికి తలనొప్పి వంకపెట్టాడు. ఐతే తనూ సినిమాకి వెళ్ళనన్నాడు సారథి.

"అదేవింటి నాకోసం మీరు సినిమా మానుకోవడం"- వాళ్ళని అక్కణ్ణించి త్వరగా వదలించుకోడానికి అన్నాడు.

వాళ్ళు వెళ్ళిపోయారు. రాఘువ కళ్ళనించి అప్రయత్నంగా రెండు బిందువులు ఝల్లున గుండెలమీద పడ్డాయి. ఎప్పుడూ కలగని మనస్సంఘర్షణ కలిగింది. ఆరాత్రి ఎంతసేపో అలా ఏడుస్తూనే వున్నాడు.

తను వీళ్ళమధ్యకి కొత్తగా వచ్చాడు. ఐనప్పటికీ స్నేహం కలిసింది- ఎంతో గాఢంగా! ప్రాణస్నేహితులయ్యారు. కాని వాళ్ళే తన్నిప్పుడు వెనక్కి నెట్టేశారు. తన స్థానంలోకి మరోవ్యక్తి వచ్చి ఆక్రమించుకొన్నాడు. తనకి రావలసిన గౌరవాలు, మర్యాదలు, ఆహ్వానాలు అతనికి వెళ్ళిపోయాయి!

సారథి వాళ్ళమధ్యకి వచ్చి సరిగా ఆరు నెలలు కావస్తోంది. అయినా వాళ్ళింకా అతన్ని "ఏమండీ" అంటూనే పిలుస్తున్నారు. తను వచ్చిన మూడునెలలకే వాళ్ళందర్నీ "ఏరా" అంటూ పలకరించాడు. "ఏరా" అనే సంబోధన స్నేహసన్నిహితత్వాన్ని వ్యక్తపరుస్తుందని భావించాడు. అలానే మూడు నెలల్లో ఆ స్నేహాన్ని పాకానికి రప్పించగలిగాడు. కాని సారథి వచ్చి తన నమ్మకను నాశనం చేసినవరకూ జ్ఞానోదయం కలగలేదు.

పోనీ ఇక మీద నించైనా వాళ్ళని తను "ఏమండీ" అని పిలిస్తే! చాలా వికారంగా ధ్వనిస్తుంది. ఈ పాతస్నేహితుని కొత్త సంబోధనకి వాళ్ళంతా నవ్వుతారు; హాస్యం చేస్తారు;


# ఆంధ్ర బ్యాంకు లిమిటెడ్

(షెడ్యూల్డు బ్యాంకు)

స్థాపితము :- 1923

హెడ్డాఫీసు :- మచిలీపట్టణము.

చెల్లింప బడిన మూలధనము, రిజర్వులు
రు.. 39,06,000 పైబడినది.

అమలునందున్న వ్యాపారము
రు. 6,00,00,000 మించినది.

మద్రాసులో బ్రాంచీలు :

మద్రాసుబ్రాంచి: 322-23, లింగిచెట్టి స్ట్రీట్.

మైలాపూర్ ఆఫీసు : 77, కచ్చేరీ వీథి.

త్యాగరాయ నగర్ ఆఫీసు :
87, పాండీ బజారు.

ఇతర బ్రాంచీలు, సబ్ ఆఫీసులు.

అమలాపురం, అనకాపల్లి, అరండల్ పేట, (గుంటూరు) బాపట్ల, భీమవరం, చీరాల, ఏలూరు, గవర్నరుపేట, (విజయవాడ), గుడివాడ, గూడూరు(నెల్లూరు జిల్లా), గుంటూరు, కాకినాడ, మచిలీపట్నం, నరసరావుపేట, నెల్లూరు, ఒంగోలు. పాలకొల్లు, రాజమండ్రి, శ్రీకాకుళం, తెనాలి, తుని, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, (సిటీ)

ఆముదాలవలస, (శ్రీకాకుళం జిల్లా), అనంతపూర్, బళ్ళారి, కడప, చల్లపల్లి (కృష్ణా జిల్లా), దుగ్గిరాల, గొల్లప్రోలు, ఇచ్ఛాపురం, (శ్రీకాకుళం జిల్లా) జగ్గయ్యపేట, కర్నూలు, మహారాణిపేట (విశాఖ పట్నం), నరసన్నపేట (శ్రీకాకుళం జిల్లా), పార్వతీపురం, పెడన(కృష్ణాజిల్లా), పెద్దాపురం, పిఠాపురం, రామారావుపేట (కాకినాడ), సాలూరు, సామర్లకోట, తిరుపతి, వినుకొండ.

అన్ని విధములైన బ్యాంకింగు వ్యాపారములు, ఫారిన్ ఎక్స్చేంజి సహా కొనసాగింపబడును.

తాడేపల్లి శ్రీరాములు,
మేనేజింగ్ డైరెక్టర్.

ఇ. రామచంద్రమూర్తి,
ఎమ్. ఏ. సి. ఏ. ఐ. ఐ. బి.,
జనరల్ మేనేజరు.

ఏడిపిస్తారు. తన మర్యాద పోయింది. తన గౌరవం పోయింది. వాళ్ళు తనని లెక్క చెయ్యటంలేదు. అసలు తన మాటనే వాళ్ళు పట్టించుకోవటంలేదు... అసలు గౌరవాన్ని తనే చేజేతులా నాశనం చేసేసుకొన్నాడు.

ఆ మర్నాటి నుంచీ వాళ్ళ సానుభూతి సంపాదించి తద్వారా తన పోయిన మర్యాదని పొందటానికి మార్గాన్ని ప్రయోగించాడు. స్నానపానాల దగ్గర, చదువుదగ్గర, క్లాసుల్లో సినిమాలకి వెళ్ళేటప్పుడు-ప్రతీచోట, ప్రతీ విషయంలోనూ మౌనాన్ని వహించాడు. ఏదో ఆలోచిస్తున్నట్టు పరధ్యానంగా వుండేవాడు.

పరీక్షలు దగ్గరకి వచ్చాయి. కష్టపడితేనే ముక్తి. అందరు దీక్షగా చదవటం మొదలుపెట్టారు. రాఘవగూడ చదువుతున్నాడు.

కాని చదివే ప్రతీ పేరాలో, పంక్తిలో సారథే, ప్రతీ వాక్యంలో మాటలో అతనికి వాళ్ళిచ్చే మర్యాదే, స్ఫురించేది. ఈ ఆలోచన తలలో తిరగడమే తరవాయి-ఉద్వేగం హెచ్చి గుండె దడదడ కొట్టుకొనేది.

ఒక పక్క జీవితాన్ని పరిష్కరించవలసిన అమూల్యమైన పరీక్షలు; రెండో వేపు తన హృదయంలో నిర్విరామంగా ధ్వనిస్తున్న ఈ భయం. ఎటూ నిర్ణయంకాని పరిస్థితిలో తల తిరిగిపోయేది. పుస్తకం దానంతటదే మూసుకుపోయేది. మనిషి మేధస్సు విశ్రాంతి కోరేది.

పరీక్ష రోజుల్లోనూ యిలానే చేశాడు. ఎంతో ప్రయత్నించాడు ఆ న్యూనతాభావాన్ని అణచుకోవాలని. కాని పక్కనసారధి, మిగతా వాళ్ళని చుట్టూ పిలుచుకొని లాజిక్, హిస్టరీ, తెలుగు పద్యాలకి అన్వయం చెబుతూవుంటే, మనస్సు అప్రయత్నంగా ఈర్ష్యతో వొణికి పోయేది.

పర్యవసానం: పరీక్ష తగలేశాడు.

చివరికి పరీక్షరాసి లాడ్జికి అందరికంటే ముందు చేరుకొన్నాడు. ఇవాళ తను ప్రపంచానికి తెలియని గొప్ప పనిని చెయ్యదలచుకొన్నాడు. జీవితాన్ని నవ్య విధాన నడుపుకోడానికి నిశ్చయించుకొన్నాడు. త్వరత్వరగా బట్టలన్నీ సర్దుకొని, ఇంతకు ముందే వ్రాసిన ఉత్తరాన్ని సారథి పెట్టెమీద పెట్టి, మిగతా వాళ్ళు రాకుండా పరుగు పరుగున స్టేషనుకి వెళ్ళిపోయాడు.

తర్వాత సారథి వచ్చాడు. పరీక్ష అన్నీ బాగా రాశాడు. ఫస్టు క్లాసు వస్తుంది. ఆ ఆనందంలో లాడ్జికి పాడుకొంటూ వచ్చాడు. కాని రాఘవ కనిపించలేదు. అతని పెట్టె, బెడ్డింగ్, సామాన్లు ఏవీ కనిపించలేదు. కంగారుగా చుట్టూ వెదికేసరికి ఉత్తరం దొరికింది. తీసి చూసుకొన్నాడు.

"ప్రియమైన పార్థసారధిగారికి—

నేను కనిపించటం లేదని ఆశ్చర్యపోకండి. మా వూరు వెళ్ళిపోతున్నాను. వెళ్లిపోతున్నట్టు యెవరికీ చెప్పలేదు. ఎందుకు చెప్పాలో అర్థం కావటంలేదు. ఒకదగ్గర కలిసి మెలసి వున్న వ్యక్తుల్లో బంధుత్వం చాలా తమాషాగా ఏర్పడుతుంది. కాని ఆ పురి హెచ్చయినా తగ్గయినా ప్రమాదమే!

నేను సహజంగా నవ్వుతాను. సరదాకి ఏడిపిస్తాను. కాని దాన్ని చాలమంది విరసంగా తీసుకొని నా పరోక్షంలో తిట్టుకొంటారు. ప్రత్యక్షంలో అసహ్యించుకొంటారు.

నా మనస్సు మరీ సున్నితమైన దనుకొంటాను. కాకపోతే వాళ్ల మూతివిరుపులకి భయపడి లోలోనే ఏడ్చుకొనేది కాదు. ఆ పిరికితనమే నన్ను ప్రతీ విషయంలోనూ చంపేసింది. నా సరదాగాని, ఉత్సాహాన్ని, ఆనందాన్ని, సంతోషాన్ని, సుఖాన్ని అన్నిటినీ ఖూనీ చేసింది. అలా దానికిలొంగి భయజీవితాన్ని గడిపేకంటె, మళ్ళా కొత్త స్నేహితుల మధ్య గౌరవజీవితాన్ని గడపడం నేర్చుకొంటాను. ఈ నగ్నసత్యాన్ని "ఇన్‌డైరెక్టు"గా నేర్పించిన పుణ్యాత్ములు మీరు. ఆవిషయంలో మీరు నాకు గురువులు... నన్ను కొంతకాలం మరచిపోండి. విస్మృతిలో విషయాలు నవ్యత్వాన్ని పొందుతాయి. నమస్తే.

—రాఘవరావు"

ఈ ఉత్తరం తీరు, తత్వం సారథికి అర్థం కాలేదు. పిచ్చిగా గోడల కేసి చూశాడు. ఏం తోచలేదు. తల తిరిగిపోతున్నట్టనిపించింది. నిలబడ్డ పాళంగా, యంత్రంవలె బయటికి పరిగెత్తాడు.